క్లుప్తంగా

రేపటి నుంచి తిరునాళ్ల మహోత్సవం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి 49వ తిరునాళ్ల మహోత్సవం ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డి తెలిపారు. 26వ తేదీ పట్టణంలో అమ్మవారి గ్రామోత్సవం, 27వ తేదీ అమ్మవారికి పొంగళ్ల సమర్పణ, గ్రామోత్సవం, 28వ తేదీ ఉత్సవ పూర్ణాహుతి, అన్నదానం, జాగరణ నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల



బొల్లాపల్లి: మండలంలోని పేరూరుపాడు గ్రామంలో నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్లను పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ నాయకుడు బొల్లా గిరిబాబు, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, ఎం. రాజయ్య, బి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బొల్లా గిరిబాబును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

వైభవంగా వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న భూసమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం 10వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభం అయినట్లు ఆలయ పూజారీ బీవీ మారుతీరామచార్యులు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో గ్రామస్తుల సహకారంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 25న అభిషేకాలు, 26న హోమాలు – కల్యాణం, 27న అన్న ప్రసాద వితరణ అనంతరం గ్రామ పురవీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపును మేళతాళాల నడుమ ఘనంగా జరుపుతామన్నారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా తిరుపతి తిరుమల వేదపండితుల సారథ్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపకాంతులతో ముస్తాబు చేశారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ తిరునాళ్ల



యడ్లపాడు: మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీలోని ప్రసన్నాంజనేయస్వామి 40వ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. చెంఘీజ్‌ఖాన్‌పేట, గోపాలపురం, సొలస, కొత్తసొలస గ్రామస్తులు సంయుక్త ఆధ్వర్యంలో వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా వేకువజాము నుంచే గుడిలో స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస, కొత్తసొలస, సంగం గోపాలపురం వాసులే కాకుండా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వివిధ మొక్కులు చేసుకున్న భక్తులు పొంగళ్లు చేసి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఇరుగ్రామాలకు చెందిన పెద్దలు తిరునాళ్ల వేడుకలకు ప్రభలను తీసుకు వచ్చారు. భక్తులకు బసెల రామకోటేశ్వరరావు కుమారుడు బసెల అచ్చియ్య, మనవడు గోపీకృష్ణ ప్రసాద పంపిణీ చేశారు.

దావీదు తనయా హోసన్నా..

- భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించిన విశ్వాసులు, చిన్నారులు

యడ్లపాడు: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే మట్టల ఆదివారం పండుగను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మట్టల ఆదివారం పురస్కరించుకుని యడ్లపాడు, తిమ్మాపురం, జాలాది, ఉప్పరపాలెం, మైదవోలు, ఉన్నవ, సందెపూడి, తుర్లపాడు, తిమ్మాపురం, దింతెనపాడు, జగ్గాపురం, కారుచోల, కొండవీడు, చెంఘీజ్‌ఖాన్‌పేట, వంకాయలపాడు, బోయపాలెం గ్రామాల్లోని ఎస్సీకాలనీల్లో సందడి నెలకొంది. యువకులు, మహిళలు, చిన్నారులు నూతన వస్త్రాలను ధరించి, ఈత మట్టలను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి ర్యాలీలు నిర్వహించారు.

తిమ్మాపురంలో..

తిమ్మాపురం హైవే పక్కనే ఉన్న లూథరన్ సంఘ దేవాలయంలో పాస్టర్ చిన్నం డేవిడ్ సుదీప్‌సాగర్ మట్టల ఆదివారం ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు. ఏసుక్రీస్తు జననం..జీవితం మావవాళికి మార్గదర్శకమని తెలిపారు. ఏసుక్రీస్తు ఈ లోకంలో జీవించిన ముప్పై మూడున్నరేళ్లలో ఆయన బోధనలు.. మరణం.. పునరుత్థానం వంటి అంశాలన్నీ మానవాళికి సమాధానాలు ఇచ్చాయన్నారు. ఏసుక్రీస్తు యోరుషలేము పట్టణంలో తొలిసారిగా ప్రవేశించిన సందర్భంగా అక్కడి ప్రజలు పూలతో అలంకరించిన ఈతమట్టలతో ఘనస్వాగతం పలికిన గొప్ప శుభదినమే మట్టల ఆదివారంగా పిలుస్తారన్నారు. అక్కడి ప్రజలు ఏసుక్రీస్తును రారాజుగా గుర్తించిన పవిత్ర దినంగా భావించిన రోజని తెలిపారు.



తిమ్మాపురం లూథరన్ చర్చి పాస్టర్ చిన్న డేవిడ్ సుదీప్‌సాగర్ ఆధ్వర్యంలో ర్యాలీ



శావల్యాపురం విమోచన ప్రార్థన మందిరంలో మట్టల ఆదివారం వేడుకల్లో పాల్గొన్న పాస్టర్ సిహెచ్ యెహేజ్కేలు, విశ్వాసులు

ఘనంగా మట్టల ఆదివారం ర్యాలీ ..

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో సండేస్కూల్ పిల్లలచే మట్టలాదివారం సందర్భంగా పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. 2024 సంవత్సరాల క్రితం ఏసు ప్రభువు యెరూషలేములోకి రాజుగా జయప్రవేశం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ర్యాలీ చేపట్టినట్లు సంఘ కాపరి రెవ. పత్రా ఫిలిప్ తెలిపారు. పిల్లలందరూ దావీదు తనయ హోసన్నా అని కీర్తనలు పాడుతూ, హల్లేలూయ అంటూ జయధ్వనులు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని పాస్టర్ ఫిలిప్ వద్ద ఆశీర్వాదాలు తీసుకున్నారు. జడ్పీ కోఆప్షన్ మెంబరు స్వెనోమ్, సంఘ అధ్యక్షులు సురభి జోసెఫ్‌కుమార్, సెక్రటరీ బేతం గాబ్రియేల్ మోజస్, ట్రెజరర్ నేలపట్ల శ్యాంప్రసాద్, గొల్లపల్లి మేరిరత్నం, ఉషాకిరణ్, పందుల ఫిలిప్, సుందరరాజు, గుంజరి, ఆదాం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఇమ్మానుయేలు తెలుగు బాపిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు, సంఘ పెద్దలు



వినుకొండలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని అన్నీ గ్రామాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారం వేడుకులను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక విమోచన ప్రార్థన మందిరంలో పాస్టర్ సిహెచ్.యెహేజ్కేలు వాక్యసందేశం అందించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ప్రార్థన మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ప్రాంతాల్లో విశ్వాసులు, చిన్నారులు ఈత మట్టలు చేత పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని క్రైస్తవ ప్రార్థనాలయాలలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు ఏసు తొలిసారిగా యెరుషలేములో జయప్రవేశం చేసిన ఘటనను గుర్తుచేసుకుంటూ చిన్నారులు ఖర్జూరపు మట్టలను చేత ధరించి ఏసు నామమును స్తుతిస్తూ ర్యాలీ నిర్వహించారు. హార్ట్ కాంపౌండ్‌లోని మిలినియం తెలుగు బాప్టిస్ట్ చర్చ్ సండే స్కూల్ చిన్నారులు క్రీస్తు ఏసుకు జయజయధ్వానాలు పలుకుతూ ర్యాలీలో పాల్గొన్నారు. సంఘకాపరి పి.తిమోతి, సండే స్కూల్ ప్రతినిధి ఎల్లారూప్, పి.రజనీప్రసాద్, సుధాకర్, బ్లెస్సీనా తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో ఖర్జూరపు మట్టలతో ర్యాలీలో పాల్గొన్న సండే స్కూల్ చిన్నారులు

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. అన్ని గ్రామాలలో గల చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు మట్టల ఆదివారం పండుగ విశిష్టత గురించి తెలియజేశారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని బైబిల్ ఫెయిత్ లూథరన్ చర్చి, మిగిలిన గ్రామాలలో గల చర్చిల ఆధ్వర్యాల్లో ఈత మట్టలతో ర్యాలీలు ప్రదర్శన నిర్వహించారు.

చిలకలూరిపేటటౌన్: ఏసుక్రీస్తు యెరుషలేములోకి వెళ్లిన సందర్భాన్ని పురస్కరించుకొని మట్టల ఆదివారం నిర్వహిస్తారని ఫాదర్ రెవరెండ్ నల్లపు మరియదాసు చెప్పారు. ఆదివారం మట్టల ఆదివారం పురస్కరించుకొని పట్టణంలోని జిడ్డు కాలనీ, బ్యాంకు కాలనీ ప్రాంతాల్లో ఈత మట్టలు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు మట్టలు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన నాదెండ్ల ఎపీఫానియా క్రీస్తు లూథరన్ దేవాలయంలో పాస్టర్ వి.మోహన్‌రావు ఆధ్వర్యంలో చర్చి నుంచి గ్రామంలోని వీధుల్లో సండేస్కూలు విద్యార్థులతో మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సంఘస్తులు, సండే స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యాసంవత్సరంలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశానికి ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్రమణ్యం చెప్పారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25 తేదీ అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు సెల్ 9391005515కు సంప్రదించాలన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

నాదెండ్ల: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సిబ్బంది ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి, ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. ఇర్లపాడు గ్రామంలో ఆదివారం కోడ్ అమలు తీరును పరిశీలించారు. గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు గానీ, రాజకీయ పార్టీల జెండాలు గానీ, శిలాఫలకాలు, నేతల విగ్రహాలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పన పర్యవేక్షించాలన్నారు. ఆయనతో పాటూ పంచాయతీ కార్యదర్శి మాధవి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మోపెడ్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తికి గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం జంక్షన్ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి గాయాలపాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రావూరి అర్జునరావు తన మోపెడ్‌పై రోడ్డును దాటే క్రమంలో చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ క్రమంలో అర్జునరావు గాయాలపాలయ్యారు. క్షతగాత్రుడిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

‘వాసవి విద్యానిధి’ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

నరసరావుపేట ఈస్ట్: అన్ని దానాల్లో కెల్లా విద్యాదానం గొప్పదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీకుసుమ హరనాథ్‌బాబా కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన వాసవి సేవా సమితి విద్యానిధి కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థులకు విద్యానిధి కమిటీ అందిస్తున్న సహకారాన్ని ఆయన కొనియాడారు. భవిష్యత్తుకు పునాది విద్యగా గుర్తించాలని కోరారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఉన్నతంగా ఎదగవచ్చని తెలిపారు. విద్యానిధి కమిటీ మాజీ అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి గోవర్ధనరావు ఆధ్వర్యంలో నూతన చైర్మన్‌గా ఐవీఎల్ రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా డి.నాగేశ్వరరావు, కోశాధికారిగా కె.జగదీష్‌కుమార్, చీఫ్ ఆర్గనైజర్‌గా సిహెచ్.చంద్రకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకుడు చీతిరాల గురుపెద్దన్న, మాజీ అధ్యక్షుడు గౌరు శ్రీనివాసరావు, వాసవి సేవా సమితుల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని సత్కరిస్తున్న వాసవి సేవా సమితి ప్రతినిధులు

మోడల్ స్కూలులో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి చెప్పారు. ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలో పదో తరగతి ఉత్తీర్ణులైయుండాలన్నారు. మార్చి 28 నుంచి మే 22వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేయాలన్నారు. జనరల్, ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150లు చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదో తరగతిలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీటు ఖరారు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9885360457 నంబరులో సంప్రదించాలని కోరారు.

చిన్నారులకు హోలీ గన్స్ అందజేత



నరసరావుపేట ఈస్ట్: హోలీ సంబరాల్లో రసాయన రహిత రంగులను వినియోగించాలని మహంకాళీ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ కొత్త సాంబశివరావు తెలిపారు. వాసవి క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో ఆదివారం పాండురంగస్వామి ఆలయం వద్ద హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉచితంగా హోలీ గన్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ, రసాయనాల వలన చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని తెలిపారు. రసాయనాల రంగులు కళ్లలో పడితే చూపు కోల్పోయే ప్రమాదముందని వివరించారు. క్లబ్ రీజినల్ సెక్రటరీ కోటేశ్వరరావు, అధ్యక్షుడు వంకాయల ఆంజనేయులు, కార్యదర్శి సనిశెట్టి మెహర్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ కృషి

- చంద్రబాబు గెలిస్తే సంక్షేమ పథకాలు అమలుకావు
- ఒకటో వార్డు సీబీ కాలనీ ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడిని గెలిపిస్తే ఇప్పుడు వచ్చే సంక్షేమ పథకాలు ఏమీ అమలుకావని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఒకటో వార్డు సీబీ కాలనీలో పర్యటించారు. స్థానికులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ ఇప్పటివరకు అందుకున్న పథకాల వివరాలు తెలుసుకొన్నారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమానికి చెందిన కరపత్రాన్ని అందజేసి వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ అనీల్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా వార్డు పరిధిలోని మహిళలు ఏర్పాటుచేసిన కేక్ కట్‌చేసి వారితో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రూ.26వేలకోట్లు రుణ మాఫీ చేశారన్నారు. వార్డులో జగనన్న ఇళ్లపట్టాలు 318మందికి ఇవ్వటం జరిగిందన్నారు. రానివారి కోసం ములకలూరు గ్రామ పరిధిలో పది ఎకరాలు సేకరించటం జరిగిందని, రెండోఫేజ్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇవ్వటం జరుగుతుందన్నారు. షేక్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆషాబేగం ఖాజావలి, కనీస వేతన అమలు బోర్డు జిల్లా సభ్యుడు రామిశెట్టి కొండలరావు, మాదిగ కార్పొరేషన్ డైరక్టర్ కందుల ఎజ్రా, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి ఎస్కే ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు యర్రంశెట్టి బాబ్జి, మాడిశెట్టి వెంకటేశ్వర్లు, షేక్ రెహమాన్, సయ్యద్ బాబ్జి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి దివ్వెల రామకృష్ణ, మార్కెట్ యార్డు కమిటీ సభ్యురాలు బత్తుల లక్ష్మీపద్మలత, నాయకులు బండి వాసంతి, మక్కెళ్ల మల్లికార్జునరావు, చీమకుర్తి శేఖర్, దాసరి శ్రీనివాసరావు, ఈవూరి రామిరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

జనమంతా జగనన్న వైపే

- వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు
- ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం

చిలకలూరిపేట: రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైపే ఉన్నారని... మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించటంతో పాటు వివిధ వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కావటి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్‌కు ప్రజల్లో విశేష ఆదరణ ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. వైఎస్సార్ సీపీకి ఉన్న ప్రజాబలాన్ని చూసి భయంతో విపక్షాలన్ని ఏకమయ్యాయని, అయినా వారి కుయుక్తులు ఫలించబోవని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి చంద్రబాబు ప్రజలను దగా చేస్తే... ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసి ప్రజలకు సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మేనిఫెస్టోను జగన్ పవిత్ర గ్రంథంలా భావిస్తే ... 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు 2014లో ఇచ్చిన 600 పైచిలుకు హామీలతో కూడిన మేనిఫెస్టోను సైతం టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారని విమర్శించారు. మతతత్వ బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తుతో వస్తున్న చంద్రబాబుకు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. పెత్తందారులకు, పేదలకు జరుగుతున్న ఎన్నికల సమరంలో వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగరవేయడం ఖాయమని తెలిపారు. పట్టణంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో పాటు పలువురు వైద్యులు, వివిధ ప్రజా సంఘాల వారిని కలిశారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కొమరవల్లిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, రాష్ట్ర ముస్లిం సంచారజాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, 14వ ఆర్థిక సంఘం సభ్యుడు వడితే కోట్యానాయక్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సిరాజ్, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



జెడ్పీటీసీ సభ్యులతో ఆత్మీయ సమావేశంలో కావటి మనోహర్ నాయుడు

దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత

నరసరావుపేట: దానగుణం కలిగి ఉండటం ప్రధానమని ఎమ్మెల్యే, నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కేతముక్కల అగ్రహారం గ్రామానికి చెందిన ఇరువురు దివ్యాంగులకు బత్తుల విష్ణు, మురళీ ఆర్థిక సహకారంతో అందజేసిన రెండు వీల్‌చైర్లను పార్టీ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. దాతలకు శుభాభివందనలు తెలిపారు. గతంలో కూడా వీరి సారథ్యంలో దివ్యాంగులకు రూ. లక్షల విలువైన వీల్‌చైర్లను అందజేయటం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా మరికొంతమంది దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ చేయాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. నిడమానూరి సురేంద్ర, ప్రవల్లికా సత్యం, హాలీవుడ్ రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

క్షయరహిత సమాజం లక్ష్యం కావాలి

నరసరావుపేట టౌన్: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏరియా వైద్యశాల వద్ద నుంచి మొదలైన ర్యాలీ పట్టణ ప్రధాన అంతర్గత వీధల గుండా సాగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ హనుమకుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందన్నారు. జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ మురళీ కృష్ణ, సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో టీడీపీ ప్రచారం

- టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఫొటోలతో ఉన్న వాటర్ బాటిళ్లు పంపిణీ
- సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన స్థానికులు
- ఎంసీసీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టివేత
- టీడీపీ నాయకుడు కిలారు ప్రసాద్‌పై కేసు నమోదు

యడ్లపాడు: టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ పార్టీ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీలోని ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఆదివారం జరిగింది. ఈ నేపథ్యంలో కొత్తసొలస వద్ద టీడీపీ రంగులతో ఆ పార్టీ అధినేత చంద్రబాబు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఫొటోలతో ఉన్న వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కొత్త సొలసకు చెందిన ఆ పార్టీ నాయకుడు కిలారు ప్రసాద్ పంపిణీ చేయడాన్ని స్థానికులు గమనించి సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయడంతో సమాచారం అందుకున్న ఎంసీసీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తులసీదాసు, వీఆర్వో నాగజ్యోతి, హెడ్ కానిస్టేబుల్ హనుమంతరావు అక్కడకు వచ్చి బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కోడ్ ఉల్లంఘించిన ప్రసాద్‌పై కేసు నమోదు చేయాలంటూ యడ్లపాడు ఎస్‌ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రసాద్ పంపిణీ చేస్తున్న 2,775 అరలీటర్ల వాటర్ బాటిల్స్‌ను సీజ్ చేసి అతనిపై క్రైమ్‌నంబర్ 22/24 కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకున్న వాటర్ బాటిళ్లు

టీడీపీ ప్రచారంలో ఉద్యోగి, రేషన్ డీలర్లు

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వ్యక్తులు పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనవద్దంటూ ఎన్నికల నియమావళిని జారీ చేసినప్పటికీ కొంతమంది యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బొల్లాపల్లి మండలం మోడల్ స్కూల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న యనమదల వెంకట్రావు ఇటీవల నూజెండ్ల మండలంలో జరిగిన టీడీపీ, జనసేన ప్రచార ర్యాలీలో పాల్గొని ఏకంగా పార్టీ జెండాలు చేతపట్టుకొని పాల్గొన్నాడు.

–రేషన్ డీలర్లు కూడా పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల నియమావళి ఉన్నప్పటికీ వినుకొండ టౌన్ పరిధిలో జరిగిన తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమాల్లో షాపు నెం.51 డీలర్ ముప్పూరి చౌడమ్మ, షాపు నెం.54 డీలర్ అహమ్మద్ అలీ, షాపునెం.52 రామయ్య అనే డీలర్లు టీడీపీకి చెందిన ప్రచార కార్యక్రమాల్లో పార్టీ కండువాలు కప్పుకొని పాల్గొన్నారు. వీరిపై ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



ప్రచారంలో పాల్గొన్న వాచ్‌మెన్ యనమదల వెంకట్రావు



ప్రచారంలో పాల్గొన్న డీలర్లు చౌడమ్మ, అహమ్మద్ అలీ, రామయ్య